## గ్రేటర్‌లో మరో 40 అదనపు ఎంఎంటిఎస్ రైళ్లు

**సికింద్రాబాద్ - మేడ్చల్, ఫలక్‌నామా - ఉందా నగర్ లమధ్య నడపనున్న దక్షిణ మధ్య రైల్వే**



హైదరాబాద్, ఏప్రిల్ 19,ప్రభాతవార్త: ఎంఎంటిఎస్ ప్రయాణికులకు దక్షిణమధ్య రైల్వే శుభవార్త చెప్పింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అదనపు ఎంఎంటిఎస్ రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న రైళ్లకు తోడుగా కొత్తగా 40 సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో 20 రైళ్లు సికింద్రాబాద్ - మేడ్చల్ మధ్య పరుగులు పెట్టనుండగా.. మరో 20ఫలక్‌నుమా –ఉందా నగర్ మధ్య నడపనున్నట్లు పేర్కొంది. కొత్తగా తీసుకువచ్చిన రైళ్లతో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఎంఎంటిఎస్ రైళ్ల సంఖ్య 106కు చేరింది. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కొత్తగా సర్వీసులు తీసుకువచ్చినట్లు అధికార వర్గాలు తెలిపారు.



# హైదరాబాద్ వార్త

# పత్రాలు లేకుండా పసిడి దందా

**తెల్ల కాగితాలపైనే లావాదేవీలు**

**కంప్యూటర్ బిల్లు ఇవ్వమంటే సాకులు**

**నగరంలో గుట్టుగా సాగుతున్న జీరో వ్యాపారం**

**చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న వాణిజ్య పన్నులశాఖ**



హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: బంగారం జీరోదందాకు కేరాఫ్ అడ్రస్‌గా నగరంలోని కొన్ని ప్రాంతాలు తయారయ్యాయి. నగరంలోని దిల్‌షుఖ్‌నగర్, జనరల్ బజార్, ఓల్డ్‌సిటీ ప్రాంతాల్లో ఎలాంటి పన్నులు చెల్లించకుండానే బంగారం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. వాస్తవానికి బూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నుండి హోల్‌మార్క్ లైసెన్స్‌లు ఉన్న వ్యాపారులు మాత్రమే బంగారం విక్రయాలు జరుపాలి. కానీ ఎలాంటి అనుమతి లేకుండానే ఆభరణాల తయారీ పేరుతో యథేచ్ఛగా కాలనీల్లో దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తున్నారు. దీనికితోడు వ్యాపారుల హస్త మాయాజాలంతో వినియోగదరుడు నిండా మునుగుతున్నాడు. బంగారం జీరో దందాలు జోరుగా నడుస్తున్నా ఏదైనా ఉదతం జరిగినప్పుడే ఈదందాలపై అధికారుల లెక్కల్లోనికి వస్తున్నాయి. తెరపైకి రాకుండా చాపకింది నీరులా సాగిపోతున్న జీరోనెంబర్ బంగారం వ్యాపారానికి నగరంలో కొదవలేదని ఐటీ అనుమానిస్తోంది. రాజధానిలో జరుగుతున్న బంగారం విక్రయాల్లో దాదాపు40శాతం రికార్డులకు దూరంగా ఉంటుందని తెలుస్తోంది. ప్రతి నెలా దాదాపు రూ.100కోట్ల వరకు ఈతరహా వ్యాపారం సాగుతోందని సమాచారం. అయినా లక్షల రూపాయల్లోనే జరుగుతుందంటూ చాలా మంది పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. బంగారం వ్యాపారంలో ఒక్కబిల్లు కట్‌చేస్తే ట్యాక్స్‌ల రూపంలో భారీ మొత్తమే చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో అటు రిటైల్ ఇటు హోల్‌సెల్ వ్యాపారాలు కాగితాల్లోనే సాగిపోతున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలోని చాలచోట్ల బంగారం దుకాణాల్లో ఎక్కువగా రెడీమెడ్ బంగారం వస్తువులు విక్రయిస్తుండటంతో హోల్‌మార్క్ ప్రకారం 91.66 కేడీయం నాణ్యత కలిగిన బంగారం రావడం లేదు. దీంతో కొనుగోలు చేసిన వినియోగదారుడు నష్టపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం తులం బంగారం ధర 30వేల వరకు విక్రయిస్తున్నారు.ఒకవేళ కొనుగోలుదారుడు విక్రయిస్తే తరువు పేరుతో నిలువునా ముంచుతున్నారు. బులియన్ మార్కెట్ నుండి వంద గ్రాములకొకటి చొప్పున బంగారం కడ్డీలు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఈకడ్డీలపై 9999 నెంబర్ ఉంటుంది. ఇదీ స్వచ్ఛమైన 91.6కేడీయం నాణ్యత కలిగిన బంగారం అన్నమాట. అయితే నగరంలోని చాలా దుకాణాల్లో వీటిని కరిగించేటప్పుడు కల్తీచేసి కోట్లకు పడిగెత్తుతున్నట్లు సమాచారం. దీనికి తోడు తూకంలో నూ అక్రమాలకు పాల్పడుతున్నారనే మరో అభియోగం కూడా ఉంది. మరికొందరు దొంగ బంగారాన్ని తక్కువ ధరకే కొని దాన్ని కరిగించి కొత్తబంగారంలో కలిపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి పన్నులు ఎగవేసేందుకు కొందరు వ్యాపారులు బంగారం దుకాణాల పేరుతో బిల్లులకు బదులుగా తెల్ల కాగితాలపైనే లావాదేవీలు నిర్వహిస్తున్నారు. జనాన్ని నమ్మించే వరకు వ్యాపారులు కొన్నాళ్లు నిబంధనలు ప్రకారం వ్యాపారం జరిపి కొన్నేండ్లుగా డబ్బులకు కక్కుర్తి పడుతూ వ్యాపారాలు పక్కదారి పట్టిస్తున్నారు. ఇతర ప్రాంతాలనుండి బంగారం తీసుకొచ్చి స్వర్ణకారులతో ఆభరణాలు తయారు చేపిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసిన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం కమర్షియల్ టాక్స్ అధికారులకు భారీ అమ్యమ్యాలు అందుతుండటంతో వారు మామూలుగా వ్యవహరిస్తున్నారు.

## మెకానిక్ పేరుతో కారు దొంగతనం

**కేసు నమోదు చేసిన గాంధీనగర్ పోలీసులు**

ధర్నాచౌక్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: మెకానిక్‌ని అంటూ కారు రిపేరు చేస్తానని నమ్మించి ఒక గుర్తు తెలియని వ్యక్తి కారును దొంగిలించుకు పోయిన ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గాంధీనగర్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని హోటల్ మారియట్ వద్ద షాద్ నగర్‌కు చెందిన భుక్యా నరేష్ అనే వ్యక్తి కారు ఎయిర్ లాక్ అవటంతో ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా కారు స్టార్ట్ కాకపోవటంతో అక్కడే ఉన్న ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తాను మెకానిక్‌నని, తాను రిపేరు చేస్తానంటూ కారు డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్నాడు. కారును వెనుకనుండి తొయ్యమని చెప్పటంతో భుక్యా నరేష్ కారును తోశాడు. ఈ క్రమంలో కారు స్టార్ట్ అవటంతో మెకానిక్‌గా ఆ కారును తీసుకుని ట్యాంక్‌బండ్ రోడ్డు నుండి వెళ్లి పోయాడు. ఎంతసేపు ఎదురుచూసినా గుర్తు తెలియని వ్యక్తి కారును తిరిగి తీసుకురాకపోవటంతో బాధితుడు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీల ఆధారంతో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## రాజేంద్రనగర్‌లో బిజెపి విజయం ఖాయం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త : రానున్న ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరటం ఖాయమని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ పిలుపు మేరకు బూత్‌ల స్వశక్తి కరణలో భాగంగా బుధవారం జరిగిన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శక్తి కేంద్రం ఇంచార్జిలు, సహాయ ఇంచార్జీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి కమిటీలను మెరుగు పరుచుకోవటంతో పాటు రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ మల్లేష్ యాదవ్, టి.సుధాకర్‌రెడ్డి, జోగి రమేష్, మైలార్‌దేవ్ డివిజిన్ ఇంచార్జి మైబు ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, సురేష్ ముదిరాజ్,నవారు మురళీదర్‌రెడ్డి, పాండు యాదవ్, శ్రీ కాంత్ రెడ్డి,శరణమ్మ, వి.లక్ష్మి,మధుసూదన్ రెడ్డి, వినయ్ రెడ్డి, కొవ్వకుల బాబు, మజహర్, ఎ.శివ, సిహెచ్ ప్రభుదాస్, బొల్ల రామకృష్ణ, జనార్ధన్, రవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అంబర్‌పేట్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సవాల్**



సమావేశంలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, ఏప్రిల్ 19,ప్రభాతవార్త: అంబర్‌పేట్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సవాలు విసిరారు. దమ్ముంటే వారం రోజుల్లో ఆలయం ఎదుట చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం అంబర్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ ఆత్మీయసమ్మేళనం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యక్షతన క్రౌన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈసమావేశానికి మంత్రి తలసాని ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. 15సంవత్సరాలు అంబర్‌పేట్ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన కిషన్‌రెడ్డి అంబర్‌పేట్‌కు చేసిందేమి లేదని.. గత నాలుగు సంవత్సరాల నుంచి కేంద్ర మంత్రిగా ఉండి తనను ఓట్లేసి గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలకు ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. అలాగే అభివృద్ధి పనులకోసం ఢిల్లీ నుంచి ఎన్ని నిధులు తీసుకువచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నాడంటే అది అంబర్‌పేట్ నియోజకవర్గ ప్రజల చలువేనని ఎమ్మెల్యేగా ఓడినందునే ఎంపిగా గెలిచి కేంద్రమంత్రి అయ్యారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా కాలేరువెంకటేష్ గెలిచిన తర్వాతనే అంబర్‌పేట్ నియోజకవర్గం పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, వాటర్ లైన్ వంటి అనేక అభివృద్ధి పనులు జరిగాయని అంబర్‌పేటన అభివృద్ధి పనులపై చర్చకు ఎమ్మెల్యే కాలేరు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, ప్రజాసంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి కులాలు, మతాలతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి బిజెపి నాయకులు రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. సిఎం కెసిఆర్ కంటే గొప్ప హిందువు ఎవరూ లేరని యాదగిరిగుట్ట వంటి గొప్ప ఆలయ నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, గొప్పగా పండగలు నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కెసిఆర్ నాయకత్వంలో 24గంటల కరెంట్, తాగునీటి సమస్యను పరిష్కరించారని.. ప్రజలు కూడా ఆలోచించాలని పనిచేసే వారికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి అంబర్‌పేట్ నియోజవకర్గంలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్థానికుడైనప్పటికీ ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా ఇంచార్జ్ దాసోజు శ్రావణ్, టిఎస్ఈడబ్ల్యూఐడిసి చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, బిసి కమిషన్ సభ్యులు కిశోర్‌గౌడ్ తదితరలు పాల్గొన్నారు.

# దత్తత మరింత సులభతరం : మంత్రి సత్యవతి రాథోడ్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త : సంతానం కలగని దంపతుల కోరికను తీర్చేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం పిల్లల దత్తత ఇచ్చే ప్రక్రియను మరింత సులభతరం చేసిందని రాష్ట్ర గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం రోజు మధురానగర్‌లోని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అడాప్షన్ హెల్ప్ డెస్క్ వచ్చిన ఫోన్ కాల్‌ను మంత్రి స్వయంగా మాట్లాడి దత్తత వివరాలను తెలియజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం దళిత కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టా త్మకంగా అమలు చేస్తుందన్నారు. సంతానం లేని తల్లిదం డ్రులకు పిల్లలను దగ్గర చేయడం, తల్లిదండ్రులు లేని చిన్నా రులకు కుటుంబాన్ని దగ్గర చేయడం ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రక్రియల ద్వారా ఈ పిల్లల దత్తత ఒక క్రమ పద్దతిలో జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధిత పత్రాలు కేరింగ్ వెబ్‌సైట్‌లో అప్లోడు చేయబడతాయని పేర్కొన్నారు. దత్తత గురించి సరైన అవగాహన లేని వారు పిల్లలు లేని తల్లిదండ్రులు ఒత్తిడికి నిరాశకు గురిఅవుతున్నారని, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఈ దత్తత సేవా కేంద్రం (అడిప్షన్ హెల్ప్ డెస్క్)ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటి కేరింగ్స్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలో అన్లైన్ రిజిస్ట్రేషన్ ఏవిధంగా చేసుకోవాలో తెలియజేయుట మరియు సరైన ధృవీకరణ పత్రములు పొందడానికి, ఎవరిని సంప్రదిం చాలనే విషయాలపై వారికి అవసరమైన సలహాలు సూచనలు ఈ హెల్ప్‌డెస్క్ ద్వారా అందజేయబడతాయని తెలియజేశారు. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రులకు ఆ పిల్లలతో ఎలా సర్దుకుపోవాలో హెల్ప్‌డెస్క్ ద్వారా కౌన్సె లింగ్ చేయడం జరుగుతుందని పిల్లలకు కూడా కొత్త జీవితంలో ఎలా ఉండాలనే విషయాలపై అవగాహన కలిగిస్తారు. పిల్లలను దత్తత తీసుకున్న తర్వాత రెండు సంవత్సరాల వరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారు నాలుగు సార్లు విజిట్ చేసి(పోస్ట్ అడాప్షన్ ఫాలో ఆప్ ద్వారా) పిల్లల పరిస్థితి ఎలా ఉందని పర్యవేక్షిస్తారని అన్నారు. తదుపరి వారికి ఏవైనా సమస్యలు ఉన్న వాటి పరిష్కారానికి హెల్ప్ డెస్క్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2000లకు పైగా తల్లిదండ్రులు పిల్లల కొరకు దరఖాస్తులు చేసుకొని పిల్లలను దత్తత తీసుకోవడానికి వేచి చూస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. కానీ ప్రస్తుతం నార్మల్‌గా 38మంది పిల్లలు ఉన్నారని ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు 100మంది ఉన్నారని అన్నారు. ఈ పరిస్థితి గురించి పిల్లల దత్తత కోసం ఎదురు చూసే (ప్రోస్పెక్టివ్ అడాప్టివ్ పేరెంట్స్) పాప్స్ ఈ అడాప్షన్ హెల్త్ డెస్క్ ద్వారా వివరించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ దత్తత సేవ సమాచారం వ్యక్తులకు కమిటి మీటింగ్ ద్వారా దూర ప్రాంతంలో ఉన్న వారికి టెలిఫోన్, వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా సహాయ పడతారని అన్నారు. తెలంగాణలో దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులు ఈ క్రింది నెంబర్లకు ఫోన్‌చేసి 040 23748663, 040 23748664 సంప్రదించవచ్చని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అభివృద్ది, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోలీ కేరి, జెడి లక్ష్మి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండుటెండలకు ఉపశమనం

**తాటి ముంజలకు భలే గిరాకీ**

**వేసవితాపం నుంచి తట్టుకునే ఎండల పండు**

**నగరంలో జోరుగా సాగుతున్న అమ్మకాలు**

**ఉపాధి పొందుతున్న వ్యాపారులు**



హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: తాటి ముంజలు వీటిని ఇష్టపడనివారంటూ ఉండరు. ఎవరికైనా రోరూరాల్సిందే. చిన్నపిల్లల నుండి పెద్దల వరకు ఎంతో ఇష్టంగా తింటారు.వేసవి నేపథ్యంలో నగరంలో తాటిముంజల విక్రయాలు జోరందుకున్నాయి. తాటి ముంజల సీజన్ వస్తే నగరవాసులకు పండగే.. ఎందుకంటే ప్రస్తుతం మార్కెట్లో దొరికే పండ్లను వివిధ రకాలు కెమికల్స్‌కలిపి బలవంతంగా పండించి మన ముందుకు తీసుకొస్తున్నారు. అదే తాటి ముంజలైతే చెట్టునుండి ముంజ తయారైన తర్వాతే తీయాలి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచివి.వీటిని తినడానికి భయపడాల్సిన అవసరమే లేదు.అందుకే మనలాంటి వాళ్లకు వేసవికాలంలో దొరికే తాటిముంజలే ప్రత్యేకం. నగరంలోని సాగర్‌రింగ్‌రోడ్డు, ఉప్పల్, కొత్తపేట్ ప్రాంతాల్లో వివిధ జిల్లాల నుండి ట్రాలీలో తాటిముంజను తీసుకువచ్చి ఇక్కడ పుట్‌పాత్‌లపై పెట్టి విక్రయిస్తున్నారు.

తాటి చెట్ల నుండి లభించే తాటిముంజలకు నగరంలో భలే డిమాండ్ ఉంది. గత రెండు ఏళ్ల క్రితంవరకు డజను 50 రూపాయలు పలికిన ముంజలు ఇప్పుడు 80నుండి 100రూపాయల వరకు పలుకుతుంది. ఇవికేవలం ఒక్కరోజు మాత్రమే తినాలి.ఎక్కువ రోజులు నిల్వఉండవు.ప్రకృతి ప్రసాదించిన తాటి ముంజలు మనిషి ఆరోగ్యానికి మంచి మేలుచేస్తుందని వైద్యులు అంటున్నారు. మనం నిత్యం తీసుకునే ఆహారంలో కల్తీ ఉంటుందేమోగానీ తాటి ముంజల్లో ఎలాంటి కల్తీ ఉండదని అంటున్నారు. తాటి ముంజలు తీసుకోవడం ద్వారా మనిషిశరీరంలో ఉష్ణోగ్రత తగ్గి,జీర్ణక్రియ బాగా జరగుతుందంటున్నారు.తాటిముంలు తీసుకువచ్చిన రోజే విక్రయిస్తే లాభం ఉంటుంది. మరునాడు విక్రయించాలంటే సాహసంతో కూడిన పని ఎక్కువ నష్టాలు మూటగట్టుకోవాల్సిందేనని వ్యాపారులు అంటున్నారు.తాటి చెట్టునుండి మండువేసవిలో కాయలు కాస్తాయి.ఒక్కోకాయలో మూడు నుండి నాలుగు వరకు తాటి ముంజలు ఉంటాయి.ఏప్రిల్‌లో ప్రారంభమై మేవరకు కేవలం నెలరోజులు మాత్రమే ఈముంజల సీజన్ ఉండటం వల్ల ఈ సమయంలో గిరాకీ కూడా ఎక్కువగా ఉంటుంది.

**ఆరోగ్యానికి మేలు..** తాటి ముంజులు తొలువగానే మధ్యలో కొంత నీరు ఉంటుంది.ఆనీరు మాత్రం నోరూరించే రుచిగా ఉంటుంది.వేసవిలో ఎండ నుండి ఉపశయనం పొందేందుకు ఈముంజలు ఎంతగానో ఉపయోగడతాయి. మనిషి శరీరంలోని ఉష్ణోగ్రత తగ్గి జీర్ణక్రియ బాగా జరుగుతుంది. శరీరానికి మంచి చల్లధనాన్ని అందిస్తుంది. ఎండాకాలం ఈతాటి ముంజల్లో ఉండే నీళ్లు చలువ చేస్తాయి. ముఖ్యంగా చిన్న పిల్లలకు, వృద్ధులకు చాలా మంచిది. వీటిలో అధికంగా తేమ,తక్కువగా కొవ్వుపదార్థాలు కలిగి చిన్నారులకు, గుండెజబ్బుల ఉన్నవారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, స్థూలకాయులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. ఆరోగ్యానికి దోహదం చేయడంతో పాటు దాహార్తికి కూడా మంచి విరుగుడు తాటిముంజలు.

**తాటి ముంజల రుచే వేరు..** ముంజల్ని, కాయ నుండి బ్రొటనవేలితో తోడుకు తినడంలో ఉండే మజాయే వేరు.. ఆమజా తీసిన ముంజలు తింటే రాదు.బొటనవేలితో ముంజతోడుకు తినటం వల్ల వస్తుంది. అందులో నీళ్లు పోకుండా తినడం అందరికీ రాదు, ఇవి ఎండ నుండి వడదెబ్బనుండి ప్రజలను సంరక్షిస్తాయి. కొంత మంది కాస్తగట్టిగా ఉండే ముంజల్ని ఇష్టపడతారు.

**ఉపాధి పొందుతున్న వ్యాపారులు..**

గ్రామీణ ప్రాంతాల నుండి తెచ్చే గౌడకులస్తుల నుండి కొనుగోలు చేసే వ్యాపారులు, తిరిగి వాటిని అమ్ముకునే చిల్లర వ్యాపారులకు విక్రయిస్తారు. వారు 80డజన్ నుండి 100రూపాయల వరకు అమ్ముతుంటారు. ధర ఎంతైనా ఏడాదిలో నెలరోజుల మాత్రం నగర వాసులు ముంజలు తినడానికి ఎంతో ఇష్టపడతారు. ముంజల్లో ఉండే తియ్య నినీరు, మృదువైన గుజ్జు ముంజలను చూడగానే మనస్సు దోచేస్తుంది. సరి హద్దు జిల్లాలు నల్గొండ జిల్లా వెల్మకన్నె, చీకటిమామిడి, ఎల్లగూడం చింతపల్లి. మహమూబ్‌నగర్ జిల్లా మాడ్గుల, నాగిల్ల, ఆమన్‌గల్ ప్రాంతాల నుండి తాటిముంజలు తీసుకువచ్చి సాగర్‌రింగ్ రోడ్డు, ఉప్పల్ రింగ్ రహదారిపై ఉదయం నుండి సాయంత్రం వరకు విక్రయించి ఉపాధిని పొందుతున్నారు.

# రాజకీయ స్నేహం.. సమస్యలపై వైరం

**బీఆర్ఎస్‌తో తమ వైఖరిని స్పష్టం చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

ధర్నాచౌక్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: బీఆర్ఎస్ పార్టీతో రాజకీయంగా స్నేహంగా ఉంటామని, ఇచ్చిన హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం అయిన సందర్భంగా బుధవారం ఎంబీభవన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఏ.విజయరాఘవన్, కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డిలతో కలసి ఆయన ప్రసంగించారు. బీజేపీ విధానాలను విమర్శించటం అంత సులువుకాదని, అందుకే కేసీఆర్‌ను సమర్థిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ బలపడాలని ప్రయత్నిస్తోందని, ఇతర పార్టీల వారిని ప్రలోభపెట్టి తమ పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఢిల్లీలో కేజ్రీవాల్, మనీష్‌సిసోడియాపై సీబీఐ దాడులు, ఇక్కడ కవితను ఈడీ విచారించటం అందులో భాగమేనని తెలిపారు. బీజేపీని అడ్డుకోవటమే తమ లక్ష్యమని, అందుకే మునుగోడు ఎన్నికలలో బీఆర్ఎస్‌తో కలసి పనిచేశామని, తర్వాత తమతో కలసి పనిచేస్తామంటూ కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. భవిష్యత్తులో పొత్తు ఉండే అవకాశం ఉందని, తాము కోరుకున్నట్లు బీఆర్ఎస్ సీట్లు ఇవ్వకపోతే విడిగా పోటీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 58 జీవో ప్రకారం పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలన్నీ క్రోఢీకరించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. జూన్‌లో సంతకాల సేకరణ, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, ఛలో అసెంబ్లీ లేదా చలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని చేపడతామంటూ ప్రజాసంఘాల పోరాట కమిటీ ఉద్యమ కార్యాచరణను రూపొందించిందని, ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని, తాము కూడా ఆ పోరాటంలో పాల్గొంటామని వివరించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాదమని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రజాస్వామిక హక్కులు కాలరాయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా సామాన్యులను సమీకరించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న తమ్మినేని వీరభద్రం

## 25న మహబూబ్ కళాశాలలో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: సనత్ నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అత్మీయ సమ్మేళనం ఈ నెల 25వ తేదీన మహబూబ్ కళాశాలలోని ఎస్.వి.ఐటీ, ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నియోజకవర్గం కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్ల స్థాయి ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతంగా నిర్వహించడంతో నాయకులను అభినందించారు. నియోజకవర్గం పరిధిలో ఎవరు ఊహించని విధంగా వందల కోట్ల రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ దేవాలయాల కమిటీల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరీ, కోలను లక్ష్మి, మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణ గౌడ్, శేషుకుమారి, ఆయా డివిజన్ల అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, గుర్రం పవన్‌కుమార్ గౌడ్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను వేధించిన వ్యక్తికి 210 రోజుల జైలు

కంటోన్మెంట్,ఏప్రిల్ 19 ప్రభాతవార్త: మద్యం సేవించి మద్యం మత్తులో కట్టుకున్న భార్యను తరుచుగా వేధిస్తున్న ఓ వ్యక్తికి 210 రోజుల జైలు శిక్ష,1100 రూపాయల జరిమానా సికింద్రాబాద్ 15వ స్పెషల్ ఎం.ఎం. కోర్టు విధించింది. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన రాజేశ్ అనే వ్యక్తి మద్యానికి బానిసై ప్రతి రోజు భార్య అంబికను, పిల్లలను తరుచుగా వేధిస్తున్నాడు. భర్త వేధింపులు తాళలేక ఈ నెల 18వ తేదీన తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంబిక ఫిర్యాదు మేరకు తుకారాంగేట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితున్ని సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు 15వ కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పర్చగా నిందితుడికి 210 రోజులు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితున్ని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపారు.

## మైనార్టీల సంక్షేమం కోసం బిఆర్ఎస్ కృషి




ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంఐఎం అధినేత ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త : మైనార్టీల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తున్నదని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు జి.రంజిత్ రెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా బుధవారం రాజేంద్రనగర్‌లోని ఎస్ఎఫ్ కన్వెన్షన్‌లో స్థానిక మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎంపి రంజిత్ రెడ్డితో పాటు హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాల మైనార్టీలకు అండగా ఉన్నదని, దేశంలో ఎక్కడ లేని విధంగా షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు పరుస్తున్నదని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ నరగంలో అన్ని దేశాలు, మతాలు, కులాలకు చెందిన ప్రజలు కలిసి మెలిసి జీవిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.



రోడ్డు, జలమండలి పనులను పర్యవేక్షిస్తున్న మహాలక్ష్మీ

## సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజల మన్ననలను పొందాలి

హైదరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:హిమాయత్‌నగర్ డివిజన్‌లోని మినర్వా కాఫీ షాప్ ప్రక్కనే ఉన్న వీధిలో జరుగుతున్న మున్సిపల్, జల మండలి పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ పర్యవేక్షించారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రజా ధనం వృధా కాకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని, ప్రజల మన్ననలను పొందాలని ఆమె ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి పేరు రాజు, జలమండలి అధికారి మహేందర్‌రెడ్డి, రోడ్ ఇన్‌స్పెక్టర్ శివ, రాష్ట్ర బిజెపి నాయకుడు జి.రామన్‌గౌడ్, నాయకులు సందీప్, సత్యంగౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి పనులు ప్రారంభించనున్న మంత్రి

సికింద్రాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త : బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పద్మారావునగర్‌లో గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రూ. 74.40లక్షలతో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. పద్మారావునగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా గల సప్తగిరి అపార్ట్‌మెంట్ వద్ద 17.70లక్షల వ్యాయంతో చేపట్టనున్న సీసీరోడ్డు, బాలాజీదాబా సమీపంలో గల గరుడ పురుమాళ్ అపార్ట్‌మెంట్ వద్ద రూ.3.20 లక్షల వ్యాయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డీ మార్ట్ సమీపంలో రూ. 24.70 లక్షల వ్యాయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

## మర్రి రాజశేఖర్ రెడ్డికి అభినందనలు తెలిపిన 5వ వార్డు నేతలు



కంటోన్మెంట్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిని బుధవారం సౌజన్య కాలనీలోని బిఆర్ఎస్ కార్యాలయంలో 5వ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షుడు పి.కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పెంట శ్రీహరిలు కలిసి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 5వ వార్డులో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని చేపట్టేందుకు హాజరు కావాలని రాజశేఖర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, షర్వీన్, వేణుగోపాల్ చారి, రవి, చొల్లేటి రమేశ్, నాగేందర్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మేలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: బిజెపి వైపు యువత అడుగులు వేస్తున్నారని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడకు చెందిన పలువురు యువకులు బుధవారం బిజెపిలో చేరారు. మండలశాఖ అధ్యక్షులు చలువాది ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఈటల సమక్షంలో వారు పార్టీలో చేరారు. రాష్ట్రశాఖ మాజీ ఉపాధ్యక్షులు పెద్ది మోహన్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డిల ద్వారా ఇతర పార్టీకి చెందిన యువకులు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఈటల వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు ఎంతో ప్రయోజనం కల్గుతుందని రాష్ట్ర వ్యాప్తంగా యువత బిజెపిలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ఎమ్మెల్యే ఈటల పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కంభం లక్ష్మారెడ్డి, మండల శాఖ ప్రధానకార్యదర్శులు కొటగిరి ప్రభంజన్‌గౌడ్, రాచకట్ల శ్రీశైలం, సొసైటీ మాజీ వైస్‌ఛైర్మన్ ఎలిమినేటి శ్రీనివాస్‌రెడ్డి, వార్డుసభ్యులు బేలె సురేశ్, నాయకులు కొత్త బాలుయాదవ్, కొమటిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రమేశ్‌నాయుడు, నరేందర్‌రెడ్డి, వేమన్‌ప్రభ, ఉదయ్, పవన్‌కుమార్, సాయి, బాలకృష్ణ, అర్జున్‌యాదవ్, శివ, వినోద్‌కుమార్, నవీన్, శివ, తరుణ్‌సాయి, సుమంత్, తేజ బన్నీ, ధర్మతేజ, దినేశ్, ప్రశాంత్‌రెడ్డి, భరత్, సిద్ధు, సునంద్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశాలు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాత వార్త: పచ్చదనం, పరిశుభ్రత ఉండే విధంగా మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఛైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని ఛైర్మన్ ప్రాతినిథ్యం వహిస్తున్న 5 వ వార్డులో వార్డు సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. వార్డులో పర్యటించి స్థానికంగా ప్రజలకు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ఛైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్, ఎ. సురేశ్, నాయకులు రాధారపు శ్రీశైలం, జితేందర్ నాయక్, నల్లవెల్లి రమేశ్, నల్లవెల్లి మురళి, సంతోశ్ నాయక్, విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 21న హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావుకు అభినందనసభ

సైఫాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె నాగేశ్వర్‌రావుకు ఈ నెల 21న నగరంలో అభినందన సభ ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్‌యాదవ్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు సభ ప్రారంభమవుతుందని, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సభలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని, జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి, జస్టిస్ బీమపాక నగేష్, జస్టిస్ పుల్లా కార్తిక్, రాష్ట్ర హైకోర్టు జనరల్ బి.ఎస్.ప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఆయన వివరించారు. దేశ చరిత్రలో తొలిసారిగా హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాగేశ్వర్‌రావు ఎన్నిక చారిత్రాత్మకమని ఆయన చెప్పారు.

## లంగర్‌హౌస్ డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి



అంబేద్కర్ నగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న వజీ ఉజ్జమా సిద్దికి

మెహిదీపట్నం, ఏప్రిల్ 19, ప్రభాతవార్త : లంగర్‌హౌస్ డివిజన్‌ను అన్నిరంగాలలో అభివృద్ధి చేసి సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమా సిద్దికి అన్నారు. కోట్లాది నిధులతో డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. బుధవారం అంబేద్కర్‌లో ఎం.పి అసదుద్దీన్ ఓవైసీ నిధులతో మంజూరైన డ్రైనేజీ పనులను ప్రారంభించి మాట్లాడారు. వేసవి ప్రారంభం కావడంతో డివిజన్‌లో తాగునీటి సమస్యలు తలెత్తకుండ తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అవసరమున్న చోట అంతర్గత సీసీ రోడ్లు, ప్రధాన రహదారులను వేయడం జరిగిందన్నారు. అంబేద్కర్‌నగర్‌లో ప్రారంభమైన డ్రైనేజీ పనులు స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఆయన వెంట నాయకులు మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మాతంగి రమేష్, రమేష్‌సింగ్, సంజయ్ స్థానికులు ఉన్నారు.

## ముస్లింలకు రంజాన్ పండుగ అత్యంత పవిత్రమైనది

**జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య**



కానుకలు అందజేస్తున్న మేయర్ కావ్యడిప్యూటీ మేయర్ శ్రీనివాస్ తదితరులు

జవహర్‌నగర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త : ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తాలు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ ఎంతో పవిత్రమైందని తెలిపారు తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కులమతాలకు తేడా లేకుండా రంజాన్, దసరా, క్రిస్మస్ పండుగలనుపేదలు సంతోషంగా జరుపుకోవాలని ప్రభుత్వం కానుకలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరో ప్రభాకర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో రంజాన్ పండుగ తోఫాలు పంపిణీ



మైనార్టీలకు రంజాన్ పండుగ తోఫాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,ఏప్రిల్ 19 ప్రభాతవార్త: రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలోని మహమ్మదీయ మసీదు,ప్రేమావతి పేట మసీదులో స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మైనార్టీలకు రంజాన్ పండుగ తోఫాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కలసి మెలిసి ఐకమత్యంతో ఉత్స వాలను జరుపుకుంటున్నారని తెలిపారు. ముస్లింలకు కార్పొరేటర్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహ్మద్ మజరుద్దీన్, షేక్ ఇషాక్, ఇలియాస్ ఖాన్, మహ్మద్ షకీల్, మహ్మద్ అన్వర్, అధ్యక్షులు యూసుఫ్ బిన్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ జావిద్, సంయుక్త కార్యదర్శి అలీ బిన్ సల్మాన్,మల్లేష్ యాదవ్, టి.సుధాకర్ రెడ్డి,బి.నర్సింహ్మా,ఎన్.మురళీధర్‌రెడ్డి,రఘుముది రాజ్,శ్రీధర్ ముదిరాజ్, ఎడ్లకడి రవితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ది ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్ సభ్యులుగా బి.క్రిష్ణ మంగారావు



ది ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్ సభ్యులుగా ఎన్నికైన బి.క్రిష్ణ మంగారావును ఉద్యోగులు అభినందిస్తున్న దృశ్యం

చార్మినార్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త : ది ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (మింట్- కాంపౌండ్ హైదరాబాద్) సభ్యులుగా బి.క్రిష్ణ మంగారావు 77 ఓట్లతో గెలు పొందారు.నగరంలోని మింట్ కాంపౌండ్‌లో బుధవారం ది ఎలక్ట్రిసిటీ డిపార్టు మెంట్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్‌కు ఎన్నికలు జరిగాయి.అత్తాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ బి.మంగారావు సౌత్ సర్కిల్ మూడు నుంచి సొసైటీ ఎన్నికల్లో పోటీ చేశారు.కాగా సౌత్ సర్కిల్ మూడు నుంచి ముగ్గురు పోటీ చేయగా వారిలో లైన్ ఇన్‌స్పెక్టర్ బి.మంగారావుకు 77 ఓట్లు లభించాయి.ఈ సందర్భంగా సొసైటీ సభ్యులుగా గెలుపొందిన మంగారావు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి కోసం తన శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. సౌత్ సర్కిల్ మూడుకు చెందిన పలువురు ఉద్యోగులు మంగారావును శాలువ కప్పి అభినందించారు.

# కళాత్మకంగా నాగభూషణం శతజయంతి వేడుకలు



నాగభూషణం కుమార్తె దంపతులను సన్మానిస్తున్న రమణాచారి, అయాచితం, ఆకృతిసుధాకర్

రవీంద్రభారతి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త : రంగస్థల, చలనచిత్ర రంగంలో నటించిన ప్రతీ పాత్రకు ఆఖరికి విలనిజానికి కూడా ప్రాణంపోసి ఒప్పించి మెప్పించి ప్రేక్షకులందరిచేత చప్పట్లు, హర్షధ్వానాలు, శుభాభినందనలు పొందిన ఏకైక నటుడు ప్రఖ్యాత రంగస్థల, సినీనటుడు నాగభూషణం అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అభివర్ణించారు. నాగభూషణం నటించిన రక్తకన్నీరు నాటకం 5వేలకుపైగా ప్రదర్శనలనిచ్చి చరిత్ర సృష్టించిందని, విలనిజం, హాస్యం, వ్యంగ్యం ఇలా ఎలాంటి పాత్రనైనా రక్తికట్టించారని కొనియాడుతూ ఘననివాళులర్పించారు. అయాచితం శ్రీధర్ అధ్యక్షోపన్యాసంలో నాగభూషణం అత్యంత ప్రతిభాశాలైన నటుడని, తెలుగునాట వాడవాడలా ప్రదర్శించిన రక్తకన్నీరు నాటకం తెలుగుజాతి ఏనాటికీ మరువదన్నారు. బుధవారం రాత్రి రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకుడు ఆకృతి సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో డా. కె.వి.రమణాచారి, అయాచితం శ్రీధర్, ఆకృతి సుధాకర్, ఫిక్కీ సీఎండి జగదీష్ చంద్ర, సింగపూర్ ప్రముఖుడు పేరి వెంకటరమణ, మోహనకృష్ణ, చేపూరి శంకర్ తదితరులు పాల్గొని నాగభూషణం కుమార్తె భవనేశ్వరి, మీర్ దంపతులను ఘనంగా సన్మానించి, అనంతరం నాగభూషణం కు ఘనని వాళులర్పించారు. సభకుముందు వర్ధమాన గాయకులు వెంకీ, వినయ్, నాగవేణి, విజయ్‌ల సినీసంగీత విభావరి ఆహుతులను ఎంతగానో అలరించి ఆకట్టుకుంది.

# సొంత భవనాలు లేని హాస్టళ్లను మూసివేయడం సరికాదు

**బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, నీలం వెంకటేష్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 19,ప్రభాతవార్త: సిఎం కెసిఆర్ 125 అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని కానీ అదే అంబేద్కర్ వారసులైన ఎస్సీ, ఎస్టీ, బిడ్డలకు హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించకుండా ఉన్న హాస్టళ్లను మూసి వేయించడానికి ఆదేశాలు ఇవ్వడం అంబేద్కర్ వారసులకు సిఎం కెసిఆర్ ఇచ్చే గౌరవం ఇదేనా అని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఈమేరకు బుధవారం బిసిభవన్‌లో నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీలం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఇప్పటికే హాస్టల్ విద్యార్థులకు సొంతభవనాలు లేవని తాము పోరాటం చేస్తుంటే ఉన్నకొద్ది హాస్టళ్లలో పిల్లలు లేనిచోట మూసేయాలని ఆదేశించడం తగదన్నారు. హాస్టళ్లలో విద్యార్థులు లేకపోతే గ్రామాల్లోని పేదపిల్లల్ని చేర్చి చదివిస్తే రేపు ఐఏఎస్‌లు, ఐపిఎస్, ఇంజనీర్లు అయితే ఆఘనత కూడా సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని తెలిపారు. అలాగే గత 9నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టళ్ల మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టల్ విద్యార్థులు అర్థాకలితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టళ్లలో కరెంట్ బిల్లులు గత 10నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పరీక్షల సమయంలో కరెంట్ కట్ చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. హాస్టళ్లకు గుడ్లు,పప్పులు తదితర వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు అప్పులపాలయ్యి నిత్యావసర సరుకులు సరఫరాను మానేస్తామని అంటున్నారని దీని మూలంగా హాస్టళ్లన్నీ మూతపడే పరిస్థితి వస్తుందని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కావును సిఎం కెసిఆర్ స్పందించి వెంటనే మెస్‌ఛార్జీలు,కరెంట్ బిల్లులు చెల్లించి గ్రామీణప్రాంతాల్లోని విద్యార్థులను హాస్టళ్లలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## బిసి అధికారిపై దుష్ప్రచారం మానుకోవాలి

**బిసి విద్యార్థి సంఘం**

**కేంద్రకమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్**

హైదరాబాద్, ఏప్రిల్ 19,ప్రభాతవార్త: ఖమ్మంలో ఇఫ్తార్ విందులో తెలంగాణ హెల్త్‌డైరెక్టర్ గడాల శ్రీనివాస్ ప్రసంగాన్ని పట్టుకుని కొంతమంది ట్రోల్స్ చేయడం వారి పరువు ప్రతిష్టను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో రాయడం సరైన పద్ధతి కాదని బిసి విద్యార్థి సంఘం కేంద్రకమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్ అన్నారు. ఈమేరకు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో అనేక మంది అధికారులు గొప్పహోదాలో ఉండికూడా ముఖ్యమంత్రి మంత్రులతో చనువుగా వ్యవహరించినా వారెవరిపైనా రాని దుష్ప్రచారం కేవలం గడల శ్రీనివాస్‌పై మాత్రమే కొంతమంది కక్ష పూరితంగా పనిగట్టుకుని చేస్తున్నారని అందరికీ అర్థమవుతుందన్నారు. గతంలోనూ సిఎం కెసిఆర్ ఆశిస్సులు తీసుకున్నప్పుడు గానీ, ఇతర సమావేశాల్లో ప్రసంగాలను వాడుకుని ఆయనపై అబండాలు వేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఒక బిసి ఉన్నతాధికారిస్థాయిలో ఉండటం చూసి ఓర్వలేక కొంతమంది వ్యక్తుల చేస్తున్న పని అని విక్రంగౌడ్ ఆరోపించారు.

## మే 5నుంచి జూన్ 4వరకు సమ్మర్ కార్నివాల్

హైదరాబాద్, ఏప్రిల్ 19,ప్రభాతవార్త: వేసవికాలంలో విద్యార్థులు, చిన్నారులు తమ కుటుంబసభ్యులతో ఆనందంగా గడిపేందుకు నెలరోజులపాటు కార్నివాల్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సమ్మర్ క్యాంప్ పోస్టర్‌న్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వాహకులు కొండల యాదగిరి,బాబురావు, యశ్వంత్ తదితరులు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం సమీపంలో కాగజ్‌ఘాట్ విలేజీలోని సిరి నేచర్స్ వ్యాలీ రిసార్ట్‌లో ఈక్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కిడ్స్ సమ్మర్ క్యాంప్, కార్నివాల్ పరేడ్, రెయిన్‌డ్యాన్స్, చిన్నారులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటలవరకు అందుబాటులో ఉంటుందని కార్నివాల్ పెరేడ్, వెల్‌కమ్ కిట్‌తో ప్రారంభమై.. ట్రైబల్ డాయన్స్‌తో ముగింపు వేడుక ఉంటుందని పేర్కొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**జవహర్ నగర్ కార్పొరేషన్**

**మూడవ డివిజన్ కార్పొరేటర్ బల్లిరోజా శ్రీనివాస్ గుప్తా**

జవహర్ నగర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జవహర్ నగర్ కార్పొరేషన్ మూడవ డివిజన్ కార్పొరేటర్ బల్లిరోజా శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని మూడో డివిజన్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల పట్టాల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 58 జీవో ద్వారా పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి వారి కలను నెరవేర్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు బల్లి శ్రీనివాస్ గుప్తా, నంగునూరు అశోక్ గుప్తా పాల్గొన్నారు

## పోచారం మున్సిపల్‌లో ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాత వార్త: మున్సిపల్ పరిధిలోని ఇరువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం మంత్రి మల్లారెడ్డి పంపిణీ చేసినట్లు ఛైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని యంనంపేట్‌కు చెందిన గండిపల్లి అరుణకు 39 వేల రూపాయల చెక్కును, నారపల్లికి చెందిన కరుణకుమార్‌కు 30 వేల రూపాయల చెక్కును పంపిణీ చేసినట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్‌తో పాటు వైస్ ఛైర్మన్ నానావత్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మందాడి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు గొంగళ్ల బాలేశ్, నాయకులు సుర్వి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముస్లింలకు రంజాన్ కానుకల పంపిణీ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాత వార్త: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పోచారం మున్సిపల్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలకు ప్రభుత్వం అందజేసిన కానుకలను బుధవారం ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో మైనారిటీ సెల్ అధ్యక్షుడు అంజాద్ ఆధ్వర్యంలో ఛైర్మన్ బి. కొండల్ రెడ్డి కొత్త దుస్తులను ముస్లింలకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్‌తో పాటు వైస్ ఛైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్ బి. హరిప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని అవుశాపూర్‌లో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ వై. కావేరి ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఏలుసాని అయిలయ్య యాదవ్, వార్డు సభ్యులు కే. వీరేశం, బొడిగే శ్రీనివాస్ గౌడ్, నాయకులు కంచర్ల వెంకట్ రెడ్డి తదితరులున్నారు. మండలంలోని కొర్రెముల పంచాయతీ వద్ద ముస్లింలకు గ్రామ సర్పంచ్ వెంకటేశ్ గౌడ్ రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డు వినోదనాగార్జున, ఉప సర్పంచ్ కందుల రాజు ముదిరాజ్ పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి

జవహర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త : మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని జవహర్ నగర్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం కార్పొరేషన్ పరిధిలో నీ మల్కారంలో ఫారుక్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జవహర్‌నగర్ సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జాంగిర్, జవహర్ నగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు భాషవాని కొండల ముది రాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్ష ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు ఖర్జూరాలు, పండ్లు తినిపించి దీక్షను విరమింపజేశారు. అనంతరం కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఫారుక్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అల్లాను వేడుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు పూడూరు చందర్, నాయకులు సుబ్రహ్మణ్యం, అబ్బు బాయ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత మంచినీటి సమస్యను పరిష్కరిస్తాం

**గాంధీనగర్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్**

ధర్నాచౌక్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని డేబోరా కాలనీలో కలుషిత మంచినీరు సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం డెబోరా కాలనీలో కలుషిత మంచినీరు సరఫరా అవుతూ ఉండటంతో స్థానికులు అస్వస్థతకు గురవుతున్నారని తెలుసుకున్న ఆమె వాటర్ వర్క్స్ అధికారులతో కలసి పర్యటించారు. స్థానికులతో చర్చించిన అనంతరం కలుషిత నీరు ఎక్కడ నుండి సరఫరా అవుతోందో పరిశీలించి, వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం మంచినీటి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయించారు. డివిజన్‌లో ఎక్కడ కలుషిత నీరు సరఫరా అయినా అధికారులు అప్రమత్తమై సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర నాయకులు ఏ.వినయ్‌కుమార్, వాటర్ వర్క్స్ డిప్యూటి జనరల్ మేనేజర్ కార్తిక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ నాయకులు ముత్యాలు, కృష్ణ ప్రసాద్, స్థానికులు జాంగిర్ పాషా, మున్నాభాయ్, అర్షద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## మార్క్సిజం దృక్కోణంలో వాసిరెడ్డి సీతాదేవి రచనలు

**తెలుగు విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపాధ్యక్షులు డాక్టర్ మంజులత**



వాసిరెడ్డి సీతాదేవి పురస్కారం అందుకుంటున్న రచయిత్రి కామేశ్వరి

ధర్నాచౌక్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: మార్క్సిజం దృక్కోణంలో వాసిరెడ్డి సీతాదేవి రచనలు చేశారని తెలుగు విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపాధ్యక్షులు డాక్టర్ మంజులత అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలోని కళా సుబ్బారావు వేదికపై డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి వంశీ గ్రంధాలయం వంశీకల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో వాసిరెడ్డి సీతాదేవి సాహితీ పుస్కార ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖ రచయిత్రి డి.కామేశ్వరికి వాసిరెడ్డి సీతాదేవి సాహితీ పురస్కారం అందచేసిన అనంతరం మంజులత మాట్లాడుతూ స్త్రీ స్వేచ్ఛ, ఆత్మగౌరవం వంటి అంశాల కథా వస్తువులుగా సీతాదేవి, కామేశ్వరి గ్రహించారని, స్త్రీ సమస్యలపై సంపూర్ణ అవగాహనతో వారు రచనలు చేశారని కొనియాడారు. ఎనభై దశకంలో వారు చేసిన రచనలు నేటికీ అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంకు అధ్యక్షత వహించిన సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ వాసిరెడ్డి సీతాదేవి, కామేశ్వరి ఇరువురూ కూడా వివేచన కల రచనలు చేశారని, స్త్రీ అస్థిత్వం వారి కథా వస్తువని అన్నారు. అనంతరం శీల సుభద్ర, వాసిరెడ్డి నారాయణరావు, ప్రముఖ రచయిత్రులు సీతాదేవి, కామేశ్వరిల రచనల గురించి మాట్లాడారు. వంశీరామరాజు స్వాగతం పలికిన ఈసభకు డాక్టర్ సుధ నిర్వహణ చేశారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని జామియా మస్జిద్ ఆవరణలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఇక్కడ ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మస్జీదులో ప్రార్థనల అనంతరం మంత్రి మల్లారెడ్డి విచ్చేసి ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసి ఉపవాసదీక్షలో పళ్లను తినిపించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. రంజాన్‌కు దుస్తుల పంపిణీ, షాదీముభారక్ పథకం కింద ఆడబిడ్డ పెళ్లికి రూ.1,00,116లు సర్కార్ ఇస్తుందన్నారు. ఈసందర్భంగా మంత్రిని మస్జీదు కమిటీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్లు ముల్లి పావని జంగయ్యయాదవ్, బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ పలుగుల మాధవరెడ్డి, సహకార సంఘం ఛైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి, బండారి అంజనేయులు, కొమ్మిడి అనురాధ, కడుపొల్ల మల్లేశ్, బేతాల నర్సింగ్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు వరిగంటి వెంకటేశ్‌గౌడ్, కీసరగుట్ట డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, సొసైటీ మాజీ ఛైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, మస్జీదు కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాత వార్త: మండు వేసవిలో ప్రయాణీకుల దాహార్తిని చలివేంద్రాలు తీర్చుతాయని పోచారం మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజి గూడలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఛైర్మన్ సమక్షంలో ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరక్టర్ బోయపల్లి సత్తిరెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణీకులకు మంచి నీరు అందించడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్‌తో పాటు వైస్ ఛైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ సురేశ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, కేఎం. రెడ్డి, జితేందర్ నాయక్, బి. రాజేశ్వర్ రెడ్డి, నల్లవెల్లి మురళి, తిలక్ నాయక్, సంతోశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల ఆర్థికాభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

కీసర, ఏప్రిల్ 19,ప్రభాతవార్త : ముస్లింల ఆర్థికాభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.బుదవారం మున్సిపల్ కార్యాలయంలో ముస్లిం సోదర,సోదరీమణులకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముస్లింలను ఎంతగానో ఆదుకుంటుందన్నారు.వారి సంక్షేమం కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవడం కోసం ప్రభుత్వం షాదీ ముబారక్ పథకం అమలు చేసి వారికి ఒక లక్షకు పైగా రూపాయలు అందజేసి ఆదుకుంటుందన్నారు.అంతే కాకుండా రంజాన్ పండుగకు వారికి నిత్యావసర వస్తువులను కూడా అందజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ వాణిరెడ్డి,మేనేజర్ చంద్రశేఖర్,వైస్ ఛైర్మన్ బండారి మల్లేష్,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు ఆదామ్ షఫీ, యూత్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, సాయినాథ్‌గౌడ్,శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

# అభివృద్ధిని విస్మరించి ధనార్జనే ధ్యేయంగా ఛైర్‌పర్సన్ పాలన...



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు

**హయత్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** కౌన్సిలర్లపై అవినీతి ఆరోపణలు చేస్తున్న పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ వ్యవహారం దొంగే... దొంగ దొంగ అన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు సిద్ధంకి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పెద్దఅంబర్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాజకీయ బిక్షపెట్టిన ఎమ్మెల్యేను, సొంత పార్టీ కౌన్సిలర్లను కాదని వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థంతో ఛైర్‌పర్సన్ పనులు చేస్తున్నారని మండిపడ్డారు. తనతో పాటు ఇతర కౌన్సిలర్లపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవన్నారు. అక్రమంగా భూములు కబ్జాచేయాల్సిన దుస్థితిలో తాము లేమన్నారు. తమకు వంశపారంపర్యంగా వచ్చిన స్థిరాస్థుల విషయంలో నిబంధనలమేరకు నడుచుకుంటున్నామన్నారు. చెరువు ఎఫ్‌టిఎల్‌లో మట్టిని పోస్తున్న విషయం వాస్తవమేనని, అది తమ పట్టా పొలం

## నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు

కావడంతో చదును చేసుకుంటున్నామన్నారు. ఇతరస్థలాల విషయంలో సైతం ప్రభుత్వం అమలు చేస్తున్న జీవోనెం.59ప్రకారం దరఖాస్తు చేసుకున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి నిర్ణయాలు ఉంటాయన్నారు. 4వ వార్డులో తాను కబ్జాచేస్తున్నట్లు చెబుతున్న స్థలం స్మశానవాటికదని... దానికి ప్రహారీ కోసం అధికారులకు పలుమార్లు విన్నవించినట్లు కౌన్సిలర్ విద్యావతి తెలిపారు. ఛైర్‌పర్సన్‌కుర్చీకి విలువనిచ్చి తాము గౌరవపూర్వకంగానే ఉన్నామని... ఏనాడు అగౌరవ పరుచలేదన్నారు. కానీ ప్రతిసారి తమపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఛైర్‌పర్సన్ అఫిడవిట్‌లో తనకు కేవలం 5 లక్షల ఆస్థి మాత్రమే ఉన్నట్లు చెప్పారని... ప్రస్తుతం వేరువేరు ప్రాంతాలలో దాదాపుగా 1000 గజాల స్థలం రెండు కరీదైన కార్లు ఎలా వచ్చాయన్నారు.

బఫర్‌జోన్‌లో ఇళ్లను ప్రోత్సహిస్తూ ఒక్కో ఇంటి యజమాని నుంచి 3-4 లక్షలు తీసుకుంటున్న మాట వాస్తవం కాదా అని వారు ప్రశ్నించారు. దనార్జనే ధ్యేయంగా మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడమే కాకుండా తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్న ఛైర్‌పర్సన్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి పాశందామోదర్, కౌన్సిలర్లు అర్చన, హరిశంకర్, పరశురాం, కోటేశ్వరరావు, నాయకులు వద్దేపల్లి విజేందర్‌రెడ్డి, పాలడుగు నాగార్జున పాల్గొన్నారు.

## గుర్రంగూడలో కంటి వెలుగు కార్యక్రమం

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 6వ డివిజన్ గుర్రంగూడలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ దడిగ శంకర్ ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమానికి మేయర్ పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కంటి పరీక్షలను పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి, గ్రామ నాయకులు జక్కిడి మధుసూదన్‌రెడ్డి, కొండా హేమంత్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## డ్వాక్రా గ్రూపులకు రూ.కోటి రుణాలు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన డ్వాక్రా పొదుపు సంఘాలకు మంజూరైన రూ.కోటి రూపాయల చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. స్థానిక మీర్‌పేట్ శివ సాయినగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి డ్వాక్రా గ్రూపులకు చెక్కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, డ్వాక్రా గ్రూపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి: అందెల



సమావేశంలో చర్చిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ కార్యక్రమాలను, కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళాని మహేశ్వరంనియోజకవర్గ బిజెపిఇంఛార్జ్ అందెల శ్రీరాములుయాదవ్ పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 8, 32 డివిజన్ల కార్పొరేటర్లు గూడెపు ఇంద్రసేన, గౌర రమాదేవి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిజెపి స్వశక్తికరణ అభియాన్ బూత్‌కమిటీల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతపై చర్చించి సమీక్షించిన ఆయన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సామ సంజీవరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, బిజెవైఎం అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డిలతో పాటు పలువురు పాల్గొనా న్నరు.

## ఆరోగ్య సంరక్షణకు వైద్య శిబిరాలు దోహదపడతాయి : చైర్మన్ చంద్రశేఖర్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ చంద్రశేఖర్

**మలక్‌పేట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** ఆరోగ్య సంరక్షణకోసం వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని మలక్‌పేట తిరుమల బ్యాంక్ ఛైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మలక్‌పేటలోని బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, ఆర్థోపెడిక్, యూరాలజీ, ఫిజియోథెరఫీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వైద్య శిబిరంలో బ్యాంకుకు చెందిన వినియోగదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకున్నారు. తమ బ్యాంకు ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారుల ఆధరాభిమానాలు చూరగొంటూ వారికి అత్యుత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్‌రెడ్డి, మారుతిరాం, గంగాధర్, సురేష్ తదతరులు పాల్గొన్నారు.

## అధికారి రాజకీయం చేయడం వలన డ్రైనేజ్ పరిష్కారంలో ఆలస్యం : డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి

**మన్సూరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మన్సూరాబాద్ డివిజన్ వివేకానంద నగర్‌కాలనీ రోడ్ నెం.6లో గత కొన్నినెలలుగా పొంగుతున్న డ్రైనేజ్ సమస్యతో సతమతవుతున్న కాలనీవాసులకు యుద్ధప్రతిపాదనగా సమస్య పరిష్కారం కోసం వాటర్ వర్క్స్ అధికారి తో పాటు కాలనీ వాసులతో కలిసి గ్రేటర్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ విపరీతమైన డ్రైనేజీ దుర్వాసనతో భూగర్భ జలాలు కలుషితమై బోర్ నీళ్ళు కూడా వాడుకోలేని పరిస్థితులల్లో కాలనీవాసులు అపార్ట్‌మెంట్స్ ఫ్లాట్లలో ఉండలేక ఖాళీ చేస్తున్నారన్నారు. సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రతిపాదనగా ఎమర్జెన్సీ షార్ట్ టెండర్ వేయడం జరిగిందని, తొందరలోనే పనులు మొదలయ్యి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. వాటర్ వర్క్స్ జీఎంకు గ్రౌండ్ లెవల్లో ఎటువంటి అవగాహన లేకపోవడం తో పాటు రాజకీయాలు చేయడం వలన డ్రైనేజీ సమస్య ఇన్ని రోజులుగా మగ్గుతుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రేమ్ కుమార్, కాలనీ వాసులు రవిచంద్ర, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పత్రిక ఆవిష్కరిస్తున్న దేవాలయం ప్రతినిధులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయం 27వ బ్రహ్మోత్సవాలు ఈనెల 21వ తేదీ శుక్రవారం నుంచి 27వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మన్ సోమ సురేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పత్రికను బుధవారం దేవాలయం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా అష్టలక్ష్మి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవ వేదంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 1.50లక్ష మంది భక్తులు బ్రహ్మోత్సవాలకు హాజరవుతారని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవాలయంలో ప్రతిరోజు భక్తులకు అన్నప్రసాదాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు మజ్జిగ, మంచినీరు కూడా సరఫరా చేస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు నగరంతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు హాజరవుతారని తెలిపారు. 27వ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కేరళరాష్ట్రంనుంచి ప్రత్యేకంగా కళాకారులను రప్పించి ఉదయం సాయంత్రం నిర్వహించే స్వామివారి రథోత్సవ కార్యక్రమంలో భక్తి పరవశ్యంతో కళాకారులు ఆటపాటలతో ముందుకు సాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. బ్రహ్మోత్సవాలలో తిరుచి పల్లకిసేవ, శేష వాహనసేవ, హంస వాహనసేవ, సూర్యప్రభ వాహనసేవ, చంద్రప్రభ వాహనసేవ, గజ వాహనసేవ, హనుమత్ వాహనసేవ, గరుడ వాహనసేవ, అశ్వ వాహనసేవ, సింహ వాహనసేవ, కల్పవృక్ష వాహనసేవ, చిన్నరథోత్సవం ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా పిలవబడుతున్న అష్టలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, బ్రహ్మోత్సవ కమిటీ కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్, ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, కమిటీ సభ్యులు చిలుకా ఉపేందర్‌రెడ్డి, బొగ్గరపు రవీందర్, శ్రీధర్, శ్రీకాంత్, శ్రీనివాస్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.


## వాంబే క్వార్టర్స్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ వాంబే క్వార్టర్స్‌లో వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు, బస్తీవాసులతో కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. డిసి నర్సింహా, డిపిఓ రత్తమ్మ, ఎఇ అన్సారి, ఎస్ఐ శివాజి తో పాటు పోలీసు, ఎంటమాలజి, వాటర్‌వర్క్స్, హార్టికల్చర్ తదితర విభాగాలకు చెందిన అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రెండు బ్లాక్స్ మధ్యలో డ్రైనేజీ నీళ్లు నిలబడడంతో దుర్వాసన వస్తుందని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, స్థానికంగా బస్తీ దవాఖానా ఏర్పాటు చేసేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. డివిజన్‌లోని సమస్యలన్నింటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అనా న్నరు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీ వాసులు మహమూద్, దశరథ్, దాస్, గౌడ్, గోవింద్, బాలు, నేతాజి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులపై చర్య తీసుకోవాలి : శ్రీవాణి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** అనేక సమస్యలపై పోరాటం చేస్తున్న తనపై స్థానిక బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు బిఆర్ఎస్ నాయకులు తన ఫోటోలను మార్ఫింగ్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని పలువురు కార్పొరేటర్లతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఫోటోలను మార్ఫింగ్ చేసి బిఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో వైరల్‌చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, అమృత, మహాలక్ష్మిరామన్‌గౌడ్, కొత్తకాపు అరుణ, కొంతం దీపిక, సురేఖ, ఓంప్రకాష్, రాష్ట్ర మహిళామోర్చా కోశాధికారి రాజ్యలక్ష్మి, డివిజన్ అధ్యక్షురాలు లావణ్య, శిరీష పాల్గొన్నారు.

## నాగార్జున మాంటిస్సోరిలో కాన్వకేషన్ డే



కాన్వకేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

**వనస్థలిపురం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో బుధవారం మాంటిస్సోరి విద్యార్థులకు కాన్వకేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నల్ల గౌనులతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నాగార్జున విద్యాసంస్థల వైస్ ఛైర్ పర్సన్ గుమ్మకొండ రజనీ విట్టల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు పాఠశాలపట్ల మక్కువ పెరగడానికి తమ పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన ఇండోర్, అవుట్ డోర్ ప్లేగ్రౌండ్లతోపాటు స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసి చిన్నారుల మానసిక వికాసంతో పాటు శారీరక వికాసానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల గ్రహణ శక్తిని పెంపొందించడానికి ఆడియో విజువల్ తరగతి గదులు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. పద్మావతి, మాంటిసోరి ఇంచార్జ్ ఉషశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌కు షాక్.. కారెక్కిన కార్పొరేటర్ బాలునాయక్



బాలు నాయక్‌కు బిఆర్ఎస్ కండువా వేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన 13వ డివిజన్ కార్పొరేటర్ నేనావత్ బాలు నాయక్ కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బాలాజీనగర్‌కు చెందిన బాలు నాయక్ బుధవారం తన వర్గీయులతో కలిసి వెంకటాపూర్ మాజీ సర్పంచ్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొర్ర జగన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె ఖలీల్ పాషతో పాటు పలువురు నాయకుల ఆధ్వర్యంలో జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో గులాబి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి బాలు నాయక్‌కు పార్టీ కండువా వేసి అభినందించారు. అనంతరం బాలు నాయక్ మాట్లాడుతూ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడినై బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనాచారి, పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, నాయకులు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, సిలే ్వరి సాంబశివ, బాలు, బొర్ర మాధవరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైయిన్ పనులు పూర్తి చేయాలి : సామ

**సైదాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ అలా ్తఫ్‌నగర్‌లో బాక్స్ డ్రెయిన్ పనులను వెంటనే పూర్తి చేయాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. అల్తాఫ్‌నగర్‌లో బాక్ ్స డ్రెయిన్ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాటా ్లడుతూ అల్తాఫ్‌నగర్, సౌభా గ్యనగర్, భాగ్యనగర్, సాయినగర్‌లలో బాక్స్ డ్రెయిన్ పనులను మధ్యలోనే ఆపివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రాబోయే వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రతరం కానుందని అన్నారు. గ్లోబల్ ఆసు పత్రి నుంచి అల్తాఫ్‌నగర్ వరకు వేయాల్సిన బాక్స్‌డ్రెయిన్ పనులు లెవల్స్ కలవక పోవడంతో మధ్యలోనే ఆపివేసి పూడ్చివేయడం జరిగిందని ఆయన విమర్శించారు. గతంలో ఇక్కడ ఉన్న ఆరడుగుల లోతు డ్రైనేజీలో వెంటనే పూడికతీత పనులు చేపట్టాలన్నారు. గతంలో వచ్చిన వరదలతో లింగోజిగూడ లో చాలామంది ఇళ్లు వదిలి వెళ్లిపోయారని, దుర్వాసన వల్ల ప్రజలు ఇప్పుడు ఇక్కడ ఉండలేక పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, కిరణ్ యాదవ్, ఈశ్వర్ యాదవ్, భారత్, నర్సింహా, విజయ్ భాస్కర్, రాకేష్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ యోగ శిబిరానికి విశేష స్పందన

**మన్సూరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మహిళ పతంజలి యోగా సమితి తెలంగాణ సౌత్ ఈస్ట్ అధ్యక్షురాలు కే.జ్యోతిర్మయి ఆద్వర్యంలో నిర్వహించిన యోగ శిక్షణకు విశేష స్పందన లభించింది. ఎల్‌బీనగర్ రాక్‌టౌన్ కాలనీలోని గొట్టేటి కల్యాణ మండపం భవనంలో వారం రోజులుగా కొనసాగిన ఇంటిగ్రేటెడ్ యోగ శిభిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ ఈ యోగశిక్షణశిభిరంలో వందలాది మంది పాల్గొని యోగాసన మెళుకువలను నేర్చుకున్నరని తెలిపారు. నేటియాంత్రిక జీవన శైలిలో ఆరోగ్య పరిరక్షనకు యోగాసనాలు ఎంతోమేలు చేస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గంట సమయాన్ని యోగాకు కేటాయిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. యోగ శిక్షణ ఇచ్చిన ట్రైనర్ జ్యోతిర్మయిని శిక్షణలో పాల్గొన్న వారు సత్కరించి, అభినందనలు తెలిపారు.

## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



అంజనీకుమారిని సేవా పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

**మలక్‌పేట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** బాలికలు అని ్న రంగాల్లో రాణించాలని తెలంగాణ హైకోర్టు సూపరింటెండెంట్ పివిసి అంజనీకుమారి పేర్కొన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జ్యోతిరావు పూలే బాలికల విద్యాలయంలో హెచ్‌ఎం నారాయణరావు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికలు ఆత్మవిశ్వాసంతో ధృఢనిశ్చయంతో ముందుకు సాగాలన్నారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూసానని, బాలికలు చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేసారు. మహిళలపై అరాచకాలను ఎదుర్కోవడానికి ప్రతి అబల ఒక సబల కావాలని ఎటువంటి ఆటుపోటులైన మహిళలు ఆత్మవిశ్వాసంతో అధిగమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వాహకులు అంజనీకుమారికి అంబేద్కర్ జాతీయ సేవా పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అవిలాల శ్రీధర్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** పండుగలు అందరిలో సోదర భావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు కొత్తపేట మసీదులో ఘనంగా ఇఫ్తర్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై రంజాన్ పండుగ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, మాజీకార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, నాయకులు సుందర్‌నారాయణ, కొత్త తిరుమల, గట్టు మహేష్, లయక్‌బెగొన్, అస్మత్‌ఖాన్, శబిక్, నాజీర్, అజ్మత్‌ఖాన్ పాల్గొన్నారు.

## గద్దె విజయ్ నేత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**వనస్థలిపురం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** బి.ఎన్.రెడ్డి డివిజన్ ఎన్జీవోస్ కాలనీ బస్ స్టాప్‌లో తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గద్దె విజయ్ నేత ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనస్థలిపురం సిఐ జలంధర్‌రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్, ఎన్జీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోమయాజులు విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎస్సై జగన్, పంపన వెంకటేశ్వరరావు, స్వీట్ హౌస్ సుబ్బారావు, ప్రభాకర్ నేత, మూర్తి, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వంద రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్, సత్యనారాయణపురం కాలనీలలో కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా ఆధ్వర్యంలో కాలనీ వెల్ఫేర్‌సభ్యులు, కాలనీవాసులతో సమస్యలను చర్చించి 100 రోజులలో ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ ఉపకమిసనర్ కృష్ణయ్య, అధికారులు రవీందర్‌రెడ్డి, పార్వతి, మహేందర్‌రెడ్డి, కానీవాసులు విశిష్ట వెంకటేశ్వర్లు, బాలరెడ్డి, రమణారెడ్డి, జయశ్రీ, సుధాకర్, విజయ్, సతిష్, బద్రీనాథ్, వెంకటేశ్వర్లు, సురేష్, బీజేపీ నాయకులు కృష్ణప్రకాష్, రామ్మోహన్, రమణ, సత్యం పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్‌లో చెరువుల సుందరీకరణ భేష్ : స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా చెరువులను సుందరీకరిస్తుండడం హర్షణీయమని తెలంగాణ మున్సిపల్ సె ్పషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పర్యవేక్షణలో సుందరీకరణ జరిగిన జిల్లెలగూడ సంద చెరువు, ప్రస్తుతం సుందరీకరణ, అభివృద్ధి పనులు జరుగుతున్న మంత్రాలచెరువు, పెద్ద చెరువులను బుధవారం ఆయన సందర్శించారు. మంత్రితో కలిసి ఆయన మూడు చెరువుల చుట్టూ కలయ తిరిగి అభివృద్ధిని పరిశీలించారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేసిన ఆయన ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చే విధంగా చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతుండడం అభినందనీయమని ప్రశంసించారు. ఆయా చెరువులను చక్కగా సుందరీకరించడానికి హెచ్‌ఎండిఎ నుండి ప్రత్యేక నిధులను మంజూరు చేయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, డిఇఇ గోపినాథ్, ఎఇఇ శ్రీనివాసులు, కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, రాజ్‌కుమార్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**మన్సూరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో వివేకానందనగర్ పేస్2కాలనీలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నీ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్నింగ్ వాక్‌లో సమస్యలు తెలుసుకున్నానని దానిలో భాగంగా ఎల్.బి.నగర్ సర్కిల్ వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ వినోద్‌తో సమావేశం నిర్వహించామన్నారు. డ్రైనేజ్ లీకయి బోరులో పొల్యూషన్ నీరు బయటకు వస్తున్నందున డ్యామేజయిన యూజీడి పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్ లైన్లు రెండు, మూడు రోజుల్లో వేయాలని ఆదేశించారు. వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ వినోద్ మాట్లాడుతూ పైప్ లైన్లు దాదాపు 18 ఫీట్ల మేర క్రింద ఉండడంతో కొంత సమయం పడుతుందనీ ఎమ్మెల్యేకి వివరించారు. దీంతో సమయం ఎక్కువగా తీసుకోకుండా పనులు యుద్ధప్రాతిపదికన ప్రారంభం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ కాలనీ పేస్2 అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన ప్రాంతాలలో ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు : ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న

**హయత్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాముల గ్రామపరిధి 3వ వార్డు కళానగర్‌లో బుధవారం 5 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సీసీరోడ్డు పనులను ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న స్థానిక కౌన్సిలర్ మోతె మణెమ్మరామలింగంతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని వెనుకబడిన వార్డులలో ప్రత్యేక నిధులను ఖర్చుచేసి అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, సీసీరోడ్లను పూర్తి చేసి ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కొత్తపల్లి జైపాల్‌రెడ్డి,కో-ఆప్షన్ సభ్యులు శంకరయ్యగౌడ్, నాయకులు చామవిజయశేఖర్‌రెడ్డి, చిరంజీవి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


## ఈస్ట్ ఆనంద్ భాగ్, గౌతమ్‌నగర్ డివిజన్లలో అభివృద్ధి పనులపై కార్పొరేటర్ల పరిశీలన

**మల్కాజిగిరి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోనీ సత్య రాఘవేంద్ర కాలనీలో కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ నాలా క్లీనింగ్ పనులను పరిశీలించారు. వర్షకాలం లోపు నాలా డిసిల్టింగ్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌లో కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ డీఈ లౌక్య,ఏఈ దివ్యజ్యోతితో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రామూయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌తో మనిషిని ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చు : డా.నాగయ్య

**హయత్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** గుండెపోటుకు గురైన వారికి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ద్వారా మనిషి ప్రాణాలను కాపాడవచ్చని డా.నాగయ్య తెలిపారు. పెద్దఅంబర్‌పేటలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం సీపీఆర్‌పై సిబ్బందికి అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యవసర సమయంలో అంబులెన్సు వచ్చేలోగా, ఆసుపత్రికి చేరేలోగా సీపీఆర్‌తో ప్రథమ చికిత్స చేయడం ద్వారా మనిషిని ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. ఈమేరకు సీపీఆర్ చేసే విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ చెవులస్వప్న, కమిషనర్ సత్యనారాయణరెడ్డి, మండల వైద్యాధికారి శ్వేత, సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



కాలనీవాసులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయమని డివిజన్ కారొ ్పరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కార్పొరేటర్ ఆధ్వర్యంలో గ్రేటర్ ఇంటెన్సివ్ సానిటేషన్, ఆర్‌డబ్ల్యూఏ ఇంట్రాక్షన్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని రీజినల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమస్యలపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్యాచ్ వర్క్ సమస్యల, బస్తీలో నీళ్ల వదలడంతో నీరు చేరి దోమలు చేరుతున్నాయని, వీధి దీపాల సమస్యల, నూతన రోడ్లు, డ్రైనేజీ మ్యాన్ హోళ్ల నిర్మాణం తదితర సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె స్పందించి స్థానికులు పేర్కొన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి బన్సీలాల్‌కుమార్, జలమండలి మేనేజర్ చంద్రునాయక్, ఎస్ఐ జయంత్, గున్నప్ప, రమేష్, సుభాష్, అలీ, దుర్గారావు, శ్రీనివాస్‌రెడ్డి, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.